


ముస్లిం నేతలకు బక్రీద్ శుభాకాంక్షలు చెబుతున్న మాజీ ఎమ్మెల్యే చెన్నకేశవ రెడ్డి, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ బుట్టా రేణుకను కలిసిన ముస్లిం నేతలు

త్యాగనిరతితోనే అల్లా కృప

- ఘనంగా బక్రీద్ వేడుకలు
- మసీదులు, ఈద్గాల్లో ప్రత్యేక ప్రార్థనలు

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలో సోమవారం ముస్లింలు బక్రీద్ వేడుకలను భక్తిశ్రద్ధలతో ఘనంగా జరుపుకున్నారు. త్యాగనిరతి, దాతృత్వంతో అల్లా కృపకు పాత్రులు కావాలని మతపెద్దలు సూచించారు. స్థానిక మసీదులు, ఈద్గాల్లో ఉదయం 6.30 గంటల నుంచి మొదలుకొని ప్రత్యేక నమాజులు చేశారు. స్థానిక కమిటీ రోడ్డులోని ఈద్గాతో పాటు స్టేట్ బ్యాంక్ వద్ద ఈద్గా, పలు మసీదుల్లో ముస్లింలు పెద్ద ఎత్తున సామూహిక నమాజులో పాల్గొన్నారు. కమిటీ రోడ్డులోని ఈద్గాలో ముస్లిం మత పెద్ద మహమ్మద్ బాషా సాహెబ్ దైవ ప్రవచనాలు వివరిస్తూ బక్రీద్ పండుగ త్యాగానికి ప్రతీక అని ఈ పండుగ సందర్భంగా ఇచ్చే ఖుర్బానీ విశిష్టతను వివరించారు. ప్రతి ముస్లిం చెడుమార్గంలో గాకుండా సన్మార్గంలో నడిచి దైవానుభూతి పొందాలని సూచించారు. ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలని కోరుతూ ముస్లింలు అల్లాను ప్రార్థించారు. అనంతరం మత పెద్ద పండుగ శుభాకాంక్షలు చెప్పగా పిల్లలు, పెద్దలు ఒకరికొకరు ఆలింగనం చేసుకుంటూ బక్రీద్ శుభాకాంక్షలు చెప్పుకున్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పట్టణ, ట్రాఫిక్ పోలీసులు తగిన చర్యలు తీసుకున్నారు.




ఎమ్మిగనూరు ఈద్గాలో ఖురాన్ సూక్తులను బోధిస్తున్న మత గురువు మహమ్మద్‌బాషా సాహెబ్, ఈద్గాలో ప్రత్యేక నమాజులో ముస్లింలు

బక్రీద్ శుభాకాంక్షలు చెప్పిన నేతలు: బక్రీద్ పర్వదినం పురస్కరించుకొని నియోజకవర్గంలోని ముస్లింలకు వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ బుట్టా రేణుక, మాజీ ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి పండుగ శుభాకాంక్షలు తెలిపారు. పట్టణంలోని జామీయ మసీదు కమిటీ అధ్యక్షుడు ఖశీంబేగ్, కమిటీ సభ్యులతో పాటు మైనారిటీ నాయకుడు రియాజ్ అహమ్మద్, పలువురు ముస్లిం మైనారిటీ మున్సిపల్ కౌన్సిలర్లు, వార్డు ఇన్‌చార్జ్‌లు వారిరువురిని వారి నివాసాల్లో కలవడంతో వారికి పండుగ శుభాకాంక్షలు తెలిపారు.

గోనెగండ్ల: ఇస్లాం ధర్మంలో భగవంతున్ని సంతృప్తి పరిచేందుకు త్యాగ గుణం ఒక ఉత్తమ మార్గమని మత గురువులు ఖతీబ్ హఫీజ్ అనాస్ తెలిపారు. సోమవారం మండల కేంద్రంతో పాటు పలు గ్రామాలు ఐరన్‌బండ, హెచ్.కై రవాడి, పెద్దనేలటూర్, పెద్దమరివీడు, కులుమాల, వేముగోడు, గంజిహళ్లి తదితర గ్రామాల్లో ముస్లింలు బక్రీద్ వేడుకలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆయా గ్రామాల్లోని మసీదులలో మత పెద్దలు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. త్యాగానికి ప్రతీక బక్రీద్ పండుగ అని, ఇబ్రహీం, ఖలీలుల్లా తన తనయుడు ఇస్మాయిల్ అల్లా కోసం ఖుర్బానీ చేయడానికి సంసిద్ధుడు కావడంతో అతని భక్తి మార్గాన్ని మెచ్చిన సందర్భం నుంచి ముస్లిం కుటుంబాలకు బక్రీద్ పండుగను ప్రసాదించారని మత గురువులు గుర్తుచేశారు.



ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు

ఘనంగా బక్రీద్ వేడుకలు

ఆదోని సెంట్రల్: హజ్రత్ ఇబ్రహీం త్యాగాన్ని స్మరించుకుంటూ అత్యంత భక్తిశ్రద్ధలతో ముస్లింలు బక్రీద్ పండుగను ఘనంగా జరుపుకున్నారు. సోమవారం షాజామియా మసీదు ఈద్గాలలో ప్రత్యేక ప్రార్థనలను చేశారు. ఈ సందర్భంగా గురువులు మాట్లాడుతూ.. త్యాగ గుణాన్ని ప్రబోధించే పండుగను స్ఫూర్తిగా తీసుకుని సమైక్యత, సమానత్వం చాటాలని పిలుపునిచ్చారు. స్వార్థం అసూయ, రాగద్వేషాలకు అతీతంగా మానవుడు జీవించాలన్నారు. పేదల పట్ల జాలి, దయ, కరుణ కలిగి జీవించడమే మానవ జీవితానికి సార్థకత అని గుర్తు చేశారు. ప్రత్యేక ప్రార్థనలో స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథి పాల్గొని ముస్లింలకు బక్రీద్ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఒకరికొకరు బక్రీద్ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. అన్ని గుణాలకన్నా దాన గుణమే ఉత్తమమని మహమ్మద్ ప్రవక్త బోధనలను గుర్తు చేసుకుని ముస్లింలు పేదలకు దానధర్మాలు చేశారు.

ఆదోని రూరల్: మండలంలోని పెద్దతుంబళం, పెద్ద పెండేకల్, మదిరె, ఇస్వీ, పెద్దహరివాణం, సంతెకూడ్లూరు, నాగనాథనహళ్లి, మండిగిరి, సాంబగల్, సుల్తానాపురం, పాండవగల్, కడితోట, ఆన్వాల్ తదితర గ్రామాల్లో సోమవారం బక్రీద్ పండుగను భక్తిశ్రద్ధలతో ముస్లింలు ఘనంగా నిర్వహించుకున్నారు. ఆయా గ్రామాల్లో ఈద్గాల వద్దకు వెళ్లి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఒకరినొకరు ఆలింగనం చేసుకుని బక్రీద్ శుభాకాంక్షలు చెప్పుకున్నారు. బక్రీద్ పండుగ విశిష్టతను ముస్లిం పెద్దలు వివరించారు.



ఆదోనిలో ప్రార్థనలో పాల్గొన్న ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథి



ఆదోని జామియా మసీదులో ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు



పెద్దతుంబళం ఈద్గాలో ప్రార్థనలో పాల్గొన్న ముస్లింలు

ప్రవక్త బోధనలు అనుసరణీయం

కౌతాళం: త్యాగనిరతి, దాతృత్వానికి ప్రతీక అయిన బక్రీద్ (ఈదుల్‌అజ్‌హా) పండుగను ముస్లింలు భక్తిశ్రద్ధలతో ఘనంగా జరుపుకున్నారు. ఇబ్రహీం అలెహీ సలాం, అతని కుమారుడు ఇస్మాయిల్ అలెహీ సలాం త్యాగనిరతికి చిహ్నంగా జరుపుకునే బక్రీద్ పండుగను ముస్లింలు వైభవంగా జరుపుకున్నారు. కౌతాళంతో పాటు మండల పరిధిలోని కుంటనహాల్, హల్వి, నదిచాగి, ఎరిగేరి, కామవరం, బదినేహాల్, ఉప్పరహాల్, చిరుతపల్లి, చూడి గ్రామాలలో తెల్లవారుజామున ఐదు గంటలకు ఫజర్ నమాజ్ తర్వాత ఉదయం 7:30 గంటలకు మసీదులకు చేరి తక్బీర్ అల్లాహుఅక్బర్, అల్లాహుఅక్బర్, లాయిలాహ ఇల్లల్లా హు వల్లాహు అక్బర్, అల్లాహు అక్బర్ వలిల్లాహిల్ హమ్దు అంటూ చదువుకుంటూ ఈద్గా వరకు పాదయాత్రగా వెళ్లి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. సన్మార్గంలో నడిచి అల్లా కృపకు పాత్రులు కావాలని మతపెద్దలు పిలుపునిచ్చారు. అల్లా మార్గంలో ప్రవక్త చూపిన పద్ధతులను పాటిస్తూ జీవించాలన్నారు. ప్రార్థనల్లో మౌలన అక్బర్ మాట్లాడుతూ.. నమాజు విశిష్టతను వివరించారు. ప్రతి ముస్లిం తప్పనిసరిగా ఐదు పూటల నమాజు చేయాలన్నారు. స్థోమత కల్గిన ముస్లింలు బక్రీద్ రోజున ఖుర్బానీ తప్పనిసరిగా ఇవ్వాలన్నారు. జగద్గురు ఖాదర్‌లింగస్వామి దర్గాలో ధర్మకర్త సయ్యద్ మున్నాపాషా చిష్తీ ఆధ్వర్యంలో ప్రత్యేక నమాజులు ఆచరించి, దర్గాలో ప్రత్యేక ఫాతెహాలు నిర్వహించి పండుగ శుభాకాంక్షలు తెలిపారు. కౌతాళంలో అందరూ సోదరభావంతో కలిసికట్టుగా ఉంటూ పండుగ జరుపుకోవాలని ధర్మకర్త సూచించారు.

పెద్దకడబూరు: త్యాగానికి ప్రతీక బక్రీద్ అని మత గురువులు రహమాన్‌సాబ్, అబ్దుల్ లతీఫ్ పేర్కొన్నారు. బక్రీద్ పండుగను పురస్కరించుకొని మండల పరిధిలోని చిన్నతుంబళం, కల్లుకుంట, హెచ్.మురవణి, మేకడోణ, బసలదొడ్డి, పెద్దకడబూరు తదితర గ్రామాలలో సోమవారం ముస్లింలు పండుగ వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. మండల కేంద్రంలో స్థానిక మసీదు నుంచి ఆదోని రహదారిలో ఉన్న ఈద్గా దగ్గరకు ముస్లింలు ర్యాలీగా వెళ్లి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా మత గురువులు మాట్లాడుతూ.. ప్రతిఒక్కరూ పేదలకు తమకు తోచినంత సహాయం చేయాలన్నారు. తమకు ఉన్న దాంట్లో ఇతరులకు పంచి పెట్టడం కన్న మించిన దాతృత్వం మరొకటి లేదన్నారు.

కోసిగి: మండల కేంద్రంలో ముస్లింలు బక్రీద్ వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. కోసిగిలోని జామియా, నూరాని సున్నీ, మదీనా, మసీద్ ఏ అక్సా మసీదుల నుంచి ముస్లింలు ర్యాలీగా బయలుదేరి రైల్వే గేటు సమీపంలోని ఈద్గా వద్దకు చేరుకున్నారు. అక్కడ మత గురువు జాకీర్ మౌలానా ఆధ్వర్యంలో ముస్లింలు ప్రత్యేక నమాజు చేశారు. బక్రీద్ పండుగ విశిష్టతను వివరించారు. త్యాగానికి ప్రతిరూపంగా నిలిచే ఈ పండుగ రోజున సమస్త మానవాళికి శాంతి చేకూరాలని అల్లా ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని ప్రార్థించారు. ముస్లింలందరూ అల్లాను తలచుకుని సన్మార్గంలో నడుచుకోవాలన్నారు. బక్రీద్ రోజున పేదలకు తోచినంత సాయం చేస్తే మంచి జరుగుతుందని వివరించారు. అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా స్థానిక పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.



ఆలింగనం చేసుకుని పండుగ శుభాకాంక్షలు తెలుపుకుంటున్న ముస్లింలు



దర్గాలో ప్రార్థన చేస్తున్న ధర్మకర్త మున్నపాషా చిష్తీ



కౌతాళంలో పండుగ ప్రత్యేకతను వివరిస్తున్న ఖాజీసాబ్



కౌతాళంలో మసీదుల నుంచి ఈద్గాకు తరలివెళ్తున్న ముస్లింలు



కుంటనహాల్ ఈద్గాలో ముస్లింల ప్రార్థనలు

క్లుప్తంగా

ఈరన్న స్వామికి అభిషేక పూజలు



పూజలందుకుంటున్న ఈరన్న స్వామి

కౌతాళం: మండల పరిధిలోని ఉరుకుంద గ్రామంలో వెలసిన ఈరన్న స్వామి దర్శనానికి సోమవారం వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. సోమవారం సెలవు రోజు కావడంతో స్వామి క్షేత్రంలో భక్తులతో సందడి నెలకొంది. అర్చకులు స్వామి వారి మూలవిరాట్‌కు తెల్లవారుజామున సుప్రభాతసేవ, మహామంగళహారతి, పంచామృతాభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించి ఫలపుష్పాలతో అలంకరించారు. అనంతరం భక్తులను దర్శనానికి వదిలారు. కొందరు భక్తులు తమ మొక్కుబడులను తీర్చుకునేందుకు ఆలయం ఆవరణలో పిండి వంటలు వండి స్వామివారికి నైవేద్యం సమర్పించారు.

త్యాగానికి ప్రతీక బక్రీద్



ప్రార్థన చేస్తున్న ముస్లింలు

మంత్రాలయం: త్యాగానికి ప్రతీకగా భావించే బక్రీద్ పండుగను మంత్రాలయంలో ముస్లింలు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. సోమవారం స్థానిక జామియా మసీదు ఇమామ్ ఖాజా బందెనవాజ్ ఆధ్వర్యంలో ముస్లింలు ఈద్గా వద్దకు వెళ్లి ప్రత్యేక ప్రార్థనలు చేపట్టారు. బక్రీద్ పండుగ విశిష్టతను ఇమామ్ చదివి వినిపించారు. నమాజు అనంతరం ఒకరినొకరు ఆలింగనం చేసుకుని బక్రీద్ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. మంత్రాలయంతో పాటు రాంపురం, మాధవరం, మాలపల్లి, చిలకల డోణ, సూగూరు, వగరూరు, తిమ్మాపురం, సింగరాజన హళ్లి, తుంగభద్ర తదితర గ్రామాల్లో బక్రీద్ వేడుకలు జరుపుకున్నారు. సీఐ ఎరిసావలి ఆధ్వర్యంలో మంత్రాలయం ఎస్‌ఐ గోపినాథ్, మాధవరం ఎస్‌ఐ కృష్ణమూర్తి ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు నిర్వహించారు.

సామూహిక భగవద్గీత పారాయణం



భగవద్గీత పారాయణం చేస్తున్న భక్తులు

కర్నూలు కల్చరల్: గీతా ప్రచార సంఘం ఆధ్వర్యంలో ఏకాదశిని పురస్కరించుకొని సంకల్ బాగ్‌లోని గీతా ప్రచార ధామలో సోమవారం సామూహిక సంపూర్ణ భగవద్గీత పారాయణం నిర్వహించారు. ధార్మిక సంస్థల ప్రతినిధులు, భక్తులు పాల్గొని అత్యంత భక్తి శ్రద్ధలతో భగవద్గీత పారాయణం చేశారు. ప్రవచన కర్త కల్లే వేణుగోపాల్ శర్మ మాట్లాడుతూ మానవ జీవిత పరమార్థం తెలుసుకోవాలంటే భగవద్గీత చదివి తీరాలన్నారు. కార్యక్రమంలో గీతా ప్రచార సంఘం అధ్యక్షులు డీవీ రమణ, తరిగొండ వెంగమాంబ సేవా సమితి వ్యవస్థాపక అధ్యక్షురాలు పసుపులేటి నీలిమ, గీతా ప్రచార సంఘం కార్యదర్శులు సింహాద్రి రమేష్, రమణ, మహాబలేష్, జగదీష్, అనిల్, నారాయణ, తిరుమల తిరుపతి దేవస్థానములు హిందూ ధర్మ ప్రచార పరిషత్ జిల్లా కార్యనిర్వాహకులు డాక్టర్ మల్లు వెంకటరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

వెండి వస్తువుల విరాళం



వెండి దీపాలు, పాదాలు అందజేస్తున్న దాతలు

మద్దికెర: మండల కేంద్రంలోని రైల్వే స్టేషన్ వద్ద ఉన్న ఇమాంసాహెబ్ దర్గాలో స్వామి వారికి స్థానిక ఆర్‌కే మిత్ర బృందం రూ.లక్ష విలువ చేసే వెండి పాదాలు, దీపాలు విరాళమిచ్చారు. వెండి వస్తువులను సోమవారం దర్గా నిర్వాహకుడు బాషాకు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ మాజీ సభ్యుడు రఫీ, మైనారిటీ సంఘం నాయకులు ఖాజావలి తదితరులు పాల్గొన్నారు.

పొలం విషయంలో ఘర్షణ

తుగ్గలి: మండల పరిధిలోని బొల్లవానిపల్లిలో పొలం వివాదంలో జరిగిన ఘర్షణలో పలువురు గాయపడ్డారు. ఓ వర్గానికి చెందిన జానకిరామిరెడ్డి, గోవిందరెడ్డి, మరో వర్గానికి చెందిన సోమశేఖరరెడ్డి, రంగారెడ్డిల మధ్య కొన్నేళ్లుగా భూ వివాదం నెలకొంది. సోమవారం ఈ విషయమై మాటామాటా పెరిగి ఘర్షణ పడగా నలుగురూ గాయపడ్డారు. వీరిలో గోవిందరెడ్డి తీవ్రంగా గాయపడగా చికిత్స నిమిత్తం పత్తికొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ విషయమై జొన్నగిరి ఎస్‌ఐ రామాంజనేయులును సంప్రదించగా బాధితుల ఫిర్యాదు మేరకు ఇరువర్గాలపై కేసు నమోదు చేస్తామన్నారు.

విత్తనశుద్ధితో మెండుగా ప్రయోజనాలు

- చీడపీడలు, తెగుళ్ల నివారణ సాధ్యం
- తక్కువ ఖర్చుతో పంటకు రక్షణ

గోనెగండ్ల: పంటల సాగులో విత్తనశుద్ధి కీలకం. తగిన జాగ్రత్తలతో విత్తనశుద్ధి చేసి, చీడపీడలు, తెగుళ్లను నివారించగలిగితే అధిక దిగుబడులు సాధించవచ్చని వ్యవసాయ అధికారులు చెబుతున్నారు. ఈ దిశగా ఖరీఫ్ సీజన్ ప్రారంభంలోనే విత్తన శుద్ధిపై రైతులకు అవగాహన కల్పించేందుకు అధికారులు సమాయత్తం అవుతున్నారు. ఖరీఫ్ సీజన్‌లో ప్రధానంగా వేరుశనగ సాగు చేపట్టే రైతులకు విత్తనశుద్ధిపై అవగాహన కల్పిస్తున్నారు.

వేరుశనగ విత్తనశుద్ధి ఇలా..

- ⇨ ఒక కేజీ వేరుశనగ విత్తనానికి 3 గ్రాముల బావిస్టన్ లేక ఎం.45 లేదా సాఫ్‌పొడి కలిపి విత్తనశుద్ధి చేయాలి. ఫలితంగా మొలకలు బాగా పెరిగి తెగుళ్ల సోకకుండా నివారిస్తాయి
- ⇨ వ్యవసాయ అధికారుల సూచనల మేరకు తగిన మోతాదులో మాత్రమే విత్తనశుద్ధి చేపట్టాలి. మోతాదు మించితే విత్తనం మొలకెత్తక నాశనం అవుతుంది.
- ⇨ విత్తన సాగు తర్వాత 25 నుంచి 35 రోజుల్లోపు ఆకుపచ్చ తెగులు సోకకుండా కాంటప్ మందును స్ప్రే చేయాలి.
- ⇨ 90 రోజుల తర్వాత బావిస్టన్‌ను స్ప్రే చేస్తే ఆకు బలంగా ఏర్పడి మంచి దిగుబడి వచ్చే అవకాశం ఉంటుంది.
- ⇨ విత్తనశుద్ధి చేసేటప్పుడు రైతులు ముఖానికి మాస్కులు, చేతులకు గ్లౌజ్‌లు విధిగా వినియోగించాలి.



వేరుశనగలో విత్తన శుద్ధిపై అవగాహన కల్పిస్తున్న వ్యవసాయ సిబ్బంది (ఫైల్)

విత్తనశుద్ధి విధిగా చేయండి



రైతులు వ్యవసాయ అధికారుల సూచనలు పాటిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చు. పంట సాగుకు ముందు విత్తనశుద్ధి ఎంతో ఉపయోగకరం. ఏ పంటకైనా మోతాదుకు మించి ఎరువులు, మందులు వాడకూడదు. రసాయన ఎరువుల వాడకం తగ్గించి, సేంద్రియ ఎరువుల వాడకాన్ని పెంచాలి. సమగ్ర సస్యరక్షణ చర్యలు చేపట్టడం నాణ్యమైన దిగుబడులు సాధించేందుకు అవకాశం ఉంటుంది.
– మహమ్మద్ ఖాద్రి, వ్యవసాయ సంచాలకులు

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

హొళగుంద: మార్లమడికి వద్ద వేదావతి నది నుంచి ఇసుకను తరలిస్తున్న 5 ట్రాక్టర్లను పోలీసులు పట్టుకున్నారు. ఆదివారం రాత్రి నదిలో అక్రమంగా ఇసుకను తవ్వుతున్నట్లు సమాచారం తెలుసుకున్న ఎస్‌ఐ పెద్దయ్యనాయుడు, సిబ్బంది అక్కడికెళ్లగా డ్రైవర్లు ట్రాలీలను వదిలి ఇంజిన్‌లతో పరారయ్యారు. పోలీసులు వాటిని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ట్రాక్టర్ యజమానులను గుర్తించి వారిపై చర్యలు తీసుకుంటామని ఎస్‌ఐ తెలిపారు.



పోలీసు స్టేషన్‌లో ఉన్న ఇసుక ట్రాక్టర్ల ట్రాలీలు

ముమ్మరంగా తనిఖీలు

ఆదోని టౌన్: బక్రీద్ పండగ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ రామచంద్రారెడ్డి, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు హరినాథ్, శ్రీనివాసులు, పులికొండ, పశువైద్య డాక్టర్లు విజయ్‌కుమార్, వంశీకృష్ణలు రెండు బృందాలుగా ఏర్పడి విస్తృతంగా పర్యటించారు. పట్టణంలో గోవధ జరగకుండా గట్టి చర్యలు తీసుకున్నారు. సోమవారం 8 కమిటీలుగా ఏర్పడి అధికారులు అనేక ప్రాంతాల్లో పర్యటించారు. ప్రధానంగా శానిటేషన్ ఎప్పటికప్పుడు శుభ్రం చేయడం, వ్యర్థ పదార్థాల కోసం గన్ని బ్యాగులను ఇంటింటికీ పంపిణీ చేశారు. ఆ బ్యాగుల ద్వారా వ్యర్థ పదార్థాలను స్థానికులు గన్ని బ్యాగుల్లో వేసి పట్టణ పరిశుభ్రతకు సహకరించాలని కమిషనర్ ముస్లింలను కోరారు. కునిముల్లా, బుడ్డేకల్, మేదర్ మసీదు, టీజీఎల్ కాలనీ, రామబావి ఏరియా తదితర ప్రాంతాల్లో ప్రత్యేక బృందాలు అడుగడుగునా తనిఖీలు చేశాయి. గోవధ నిషేధంలో భాగంగానే ఈ తనిఖీలు చేసినట్లు అధికారులు వెల్లడించారు.



మేదర్ మసీదు ప్రాంతంలో పర్యటిస్తున్న మున్సిపల్ కమిషనర్ రామచంద్రారెడ్డి, అధికారులు

స్నేహితురాలికి సాయం

పత్తికొండ రూరల్: ఆపదలో ఉన్న స్నేహితురాలికి తోటి మిత్రులు సాయం అందించారు. 1997లో పత్తికొండలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చదువుతున్న పూర్వ విద్యార్థిని సావిత్రి భర్త అనారోగ్యంతో మృతి చెందాడు. ఇద్దరు పిల్లల కుటుంబ పోషణతో తమ స్నేహితురాలు ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న విషయం తెలుసుకున్న మిత్రులు ఫోన్ పే ద్వారా రూ.25 వేలు పోగు చేసి ఆర్థిక సాయాన్ని తమ మిత్రుల ద్వారా సోమవారం బాధితురాలికి అందించారు.



స్నేహితురాలికి ఆర్థిక సాయం అందిస్తున్న మిత్రులు

బాధిత కుటుంబానికి అండగా ఉంటాం



మాల మల్లయ్య చిత్రపటానికి నివాళులర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ బుట్టా రేణుక

నందవరం: మండలంలోని కనకవీడు గ్రామానికి చెందిన మాల మల్లయ్య కుటుంబానికి అండగా ఉంటామని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ బుట్టా రేణుక, తనయుడు బుట్టా ప్రతుల్ భరోసా ఇచ్చారు. వారు సోమవారం కనకవీడు గ్రామానికి వెళ్లి మాల మల్లయ్య చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ ఓటమిని జీర్ణించుకోలేక గుండెపోటుకు గురై మాల మల్లయ్య మృతి చెందడం బాధాకరమన్నారు. ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఎల్లవేళలా కుటుంబానికి అండగా ఉంటామని భరోసా కల్పిస్తూ ఆర్థిక సాయం అందించారు. సంతాపం తెలిపిన వారిలో వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి లక్ష్మీకాంత్ రెడ్డి, మండల కన్వీనర్ శివారెడ్డి గౌడ, నియోజకవర్గ బీసీ సెల్ అధ్యక్షుడు విరుపాక్షి రెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి పేట శ్రీనివాస రెడ్డి, నాయకులు గడ్డం నారాయణ రెడ్డి, వెంకటేశ్వర రెడ్డి, నరహరి రెడ్డి, చిన్న రాముడు, సర్పంచ్ పెద్ద ఈరన్న, నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

అకారణంగా వంట ఏజెన్సీ తొలగింపు

పెద్దకడబూరు: అకారణంగా వంట ఏజెన్సీని తొలగించిన పాఠశాల ప్రధానోపాధ్యాయురాలిపై చర్యలు తీసుకోవాలని వంట ఏజెన్సీ సభ్యులు నారాయణమ్మ వాపోయారు. ఆమె సోమవారం విలేకర్లతో గోడు వెల్లబోసుకున్నారు. ఆమె మాట్లాడుతూ 2021లో తహసీల్దారు, ఎంపీడీఓ, ఎంఈఓ తిసభ్య కమిటీ చైర్మన్ ద్వారా ఎన్నుకున్న పాఠశాల వంట ఏజెన్సీని ఎలాంటి కారణం లేకుండా, ముందస్తు నోటీసులు కూడా తొలగించి కొత్తవారిని నియమించడం ఏమిటని ప్రశ్నించారు. ముందస్తు నోటీసులు ఇవ్వకుండా ఇలా చేయడం తమకు అవమానంగా ఉందని వాపో యారు. అలాగే బడి పిల్లలకు వంట చేయడానికి కావాల్సిన సరుకులు, కూరగాయలు కొనుగోలు చేసి ఆర్థికంగా కూడా నష్టపోయామన్నారు. ఉన్నతాధికారులు స్పందించి తమకు న్యాయం చేయాలని కోరారు.



త్రిసభ్య కమిటీ ఇచ్చిన ఉత్తర్వులను చూపుతున్న వంట ఏజెన్సీ సభ్యులు